సాంకేతిక పరిజ్ఞానంతో భూసర్వే

డీజీపీఎస్ పరికరాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, మార్చి 15: ప్రస్తుత పరిస్థితుల్లో భూ సర్వే చేయడానికి అత్యాధునిక పరిజ్ఞానం ఉపయోగించాలని కలెక్టర్ శ్రీహర్ష చెప్పారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల కొనుగోలు చేసిన డీజీపీఎస్ పరికరాన్ని జిల్లా సర్వే అధికారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యాధునిక పరిజ్ఞానంతో ప్రభుత్వ భూముల సర్వే చేపట్టి హద్దులు నిర్ణయించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, జిల్లా సర్వే అధికారి గిరిధర్, సర్వేయర్లు మూసా, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఈనెల 18 నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం 7,678 మంది రెగ్యులర్, 95మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. దీనికోసం 38 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 38మంది డిపార్ట్‌మెంట్ అధికారులు విధుల్లో ఉంటారన్నారు. పరీక్ష సమయంలో కేంద్రాలను తాసీల్దార్లు తనిఖీ చేయాలని, జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, విద్యుత్, వైద్య సహాయం అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. విద్యార్థులు ఉదయం పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరేందుకు బస్సులు పరీక్ష కేంద్రాల వరకు నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఈవో అబ్దుల్ ఘని, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి సర్కారు కృషి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 15 : మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సుదర్శన్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

అండర్ పాస్ నిర్మించాలి

వినతి పత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే

దేవరకద్ర, మార్చి 15 : మండలకేంద్రంలోని రైల్వే గేట్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో రైల్వే జీఎంను ఎమ్మెల్యే కలిసి మాట్లాడారు. ఆర్వోబీ ఏర్పాటయ్యాక రైల్వే గేట్‌ను బంద్ చేయడంతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వ్యాపారసంస్థలు మూతపడే అవకాశం ఉన్నందున అక్కడ అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. రైల్వే జీఎం ఇందుకు సానుకులంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండీడ్, మార్చి 15 : గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మాధవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రత్యేక అధికారులకు సూచించారు. సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరా రు. సమావేశంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్యగౌడ్, ఎంపీడీవో దేవన్న, ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధ్యతగా చదివించాలి

- అదనపు కలెక్టర్ మోహన్‌రావు

మహబూబ్‌నగర్, మార్చి 15 : హైదరాబాద్‌లోని పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో లక్కీడిప్ ద్వారా సీటు పొందిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు బాధ్యతగా చదివించాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో సంబంధిత అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో లక్కీడిప్ ద్వారా గిరిజన విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 11మంది దరఖాస్తు చేసుకోగా ఐదుగురిని లక్కీడిప్ ద్వారా ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి ఛత్రూనాయక్ తదితరులున్నారు.

బేగంపేట స్కూల్‌కు ఒక్కరు..

బేగంపేటలోని ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 1వ తరగతి ప్రవేశానికి సంబంధించి లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసినట్లు అదనపు కలెక్టర్ మోహన్‌రావు తెలిపారు. 17మంది దరఖాస్తు చేసుకోగా మూడు తిరస్కరణకు గురైనట్లు ఆయన పేర్కొన్నారు. మిగిలిన వాటిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి, తర్వాత మరో ఇద్దరిని ఎంపిక చేసి రిజర్వులో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమశాఖ అధికారి ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

నారాయణపేట టౌన్, మార్చి 15: వినియోగదారుల హక్కుల చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కలెక్టరేట్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ జీవితంలో వస్తువుల వినియోగం తప్పనిసరి అని, కొనుగోలు చేసిన వస్తువు నాసిరకం అని తేలితే వస్తువు అమ్మిన వ్యాపారిపై, ఉత్పత్తిదారుపై వినియోగదారుల ఫోరంలో కేసు వేసి నష్టపరిహారం పొందవచ్చన్నారు. జెడ్పీ సీఈవో శైలజ మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల చట్టం క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా చూడాలన్నారు. ప్రతి రెండు నెలలకు ఓసారి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పేట జిల్లా కేంద్రంలో వినియోగదారుల ఫోరం కోర్టును ఏర్పాటు చేయాలని పలువురు కోరగా స్పందించిన పౌర సరఫరాల శాఖ అధికారి సుదర్శన్, కలెక్టర్‌కు విన్నవిస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో రాజేశ్వరి, వ్యవసాయ శాఖ అధికారి జాన్‌సుధాకర్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా..

పేద విద్యార్థులకు అండగా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఉంటుందని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రవేశాలకు సంబంధించిన డిప్‌ను తీసి విద్యార్థిని ఎంపిక చేశారు. పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో ప్రవేశం పొంది ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కన్యాకుమారి టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ జిల్లా సమన్వయ కర్త దేవసేన తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

తేది: 15-03-2024

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయడమేమనగా నా క్లయింటు శ్రీ తోటపల్లి శివయ్య తండ్రి పోచయ్య, వృత్తి వ్యాపారము, నివాసము బాదేపల్లి గ్రామము, జడ్చర్ల మండలము, మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణ గారి తరపున జారీ చేయు బహిరంగ ప్రకటన యేమనగా మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలము, బాదేపల్లి గ్రామము మరియు శివారులోని సర్వే నెం. 103 నందలి ప్లాట్ నెంబరు 124, విస్తీర్ణము 200 చదరపు గజములు గల ప్లాటుకు నా క్లయింటు యజమాని. పై కనబరచిన ప్లాటుకు సంబంధించిన లింకు దస్తావేజు నెం. 957/1996, ఎస్.ఆర్.ఒ. జడ్చర్ల ప్రస్తుతము నా క్లయింటు ఆధీనములో లేదు. పై కనబరచిన లింకు డాక్యుమెంటుకు సంబంధించి ఎవరికైనా ఏలాంటి అభ్యంతరాలు, అధికారములు, హక్కులు, అక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన వెలుబడిన నాటి నుండి (5) రోజులలోపు తమ ఆక్షేపణలను క్రింద కనబరచిన చిరునామాకు తెలుపగలరని ఇట్టి బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయనైనది.

పై ప్లాటుకు హద్దులు :- తూర్పు : ప్లాటు నెం.119, పడమర : 33 ఫీట్ల రోడ్డు, ఉత్తరం : ప్లాటు నెం.125, దక్షిణము : ప్లాటు నెం.123

GOPAL JHAWAR, Advocate
30-141, Venkateshwara Colony,
Jadcherla-509301, Mahabubnagar Dist.
Cell : 9291211196

బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తును స్వాగతిస్తున్నాం

- పార్లమెంట్ ఎన్నికల్లో కలిసికట్టుగా పోటీ
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే బండ్ల, మాజీ ఎమ్మెల్యేలు ఎస్ఆర్‌రెడ్డి, ఆల

నారాయణపేట, మార్చి 15: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్–బీఎస్పీ కలిసికట్టుగా పోటీ చేయాలని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు తీసుకున్న నిర్ణయాన్ని ఉమ్మడి పాలమూరు జిల్లా బీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తున్నదని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ నారాయణపేట జిల్లా కార్యాలయంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, ఆలవెంకటేశ్వరరెడ్డి, అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్–బీఎస్పీ పొత్తులో భాగంగా నాగర్‌కర్నూల్, హైదరాబాద్ స్థానాలను బీఎస్పీకి కేటాయించామని, ఈ రెండు చోట్ల బీఎస్పీ అభ్యర్థుల గెలుపు కోసం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేస్తారన్నారు. అలాగే మిగిలిన 15 స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం బీఎస్పీ నాయకులు పని చేసి సహకరిస్తారని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీకి చెందిన కౌన్సిలర్లు, ఎంపీటీసీలు అందరూ పార్టీ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారని తెలిపారు. ఇటీవల శాసనమండలి ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేయకపోవడం వలన కాంగ్రెస్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ప్రస్తుతం శాసనమండలి ఎన్నికల్లో మొత్తం 1,400 ఓట్లలో కాంగ్రెస్‌కు కేవలం 350 ఓట్లే ఉన్నాయని అన్నారు. అయినా పోటీలో ఎలా నిలబడతారన్నారు. బలం లేకున్నా గెలుస్తామని కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు.

'ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూనే ఉంటా..'

రూ.2లక్షల రుణమాఫీ చేయకున్నా, 24 గంటల కరెంటు ఇవ్వకున్నా, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇవ్వకున్నా, ఆసరా పింఛన్లు పెంచి ఇవ్వకున్నా, వరి పంటకు బోనస్ ఇవ్వకున్నా, 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేయకున్నా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ పేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామన్నారని, అందువల్లే వంద రోజులు తాను ప్రశ్నించకుండా ఉన్నానని తెలిపారు. నేటితో 100 రోజులు పూర్తయ్యాయని, ఇక నుంచి ప్రశ్నించడం మొదలు పెడతానన్నారు. ఇప్పటి ఎమ్మెల్యే తాను మొదలుపెట్టిన పనులనే ప్రారంభిస్తున్నారు తప్పా.. గత వంద రోజులుగా ఒక్క కొత్త పనికి కూడా శంకుస్థాపన చేయలేదన్నారు. తాను ఆమోదముద్ర వేయించిన ఎన్ఆర్ఈజీఎస్ పనులకు నేడు గ్రామాల్లో ఏ హోదాలో కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపనలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా కొడంగల్–నారాయణపేటను జంట నగరాల మాదిరిగా అభివృద్ధి చేస్తానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గానికే రూ.5వేల కోట్లు మంజూరు చేయించుకున్నాడు తప్పా, పేట నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకానికి తాను వ్యతిరేకంకాదని, కానీ ఈ ప్రాజెక్టు వలన నారాయణపేట నియోజకవర్గానికి పెద్ద ప్రయోజనం లేదన్నారు. 90శాతం పనులు పూర్తయిన పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో వెంటనే కాల్వలను తవ్వాలని డిమాండ్ చేశారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ పొత్తులో భాగంగా నాగర్‌కర్నూల్ బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపు కోసం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేస్తారన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు విజయ్‌సాగర్, చంద్రకాంత్, కన్నా జగదీశ్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

తండ్రి సాయంతో భర్తను హత్య చేసిన భార్య

దేవరకద్ర రూరల్ (చిన్నచింతకుంట), మార్చి 15 : తండ్రి సాయంతో కట్టుకున్న భర్తను హత్యచేసి శవాన్ని మూటగట్టి పాతిపెట్టిన ఘటన చిన్నచింతకుంట మండలం కురుమూర్తిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై శేఖర్ కథనం ప్రకారం మూసాపేట మండలం వేముల గ్రామానికి చెందిన సాయన్నకు చిన్నచింతకుంట మండలం కురుమూర్తి గ్రామానికి చెందిన శివమ్మతో 17ఏండ్ల కిందట వివాహం జరిగింది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా, వారు తరచూ గొడవ పడేవారు. దీంతో శివమ్మ జనవరిలో తల్లిగారింటికి (కురుమూర్తి) వచ్చింది. అప్పటి నుంచి భర్త దగ్గరకు వెళ్లకుండా కురుమూర్తి గ్రామంలోనే ఉండిపోయింది. ఈనెల 10న సాయన్న తన భార్యను తీసుకెళ్లడానికి కురుమూర్తి గ్రామానికి వచ్చాడు. ఇంటికి రావాలని భార్యను కోరగా తాను రాను అని గొడవకు దిగగా, శివమ్మ తండ్రి వెంకటన్న కల్పించుకొని ఘర్షణకు దిగి కర్రతో సాయన్న తలపై బలంగా కొట్టగా అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో వారు సాయన్న మృతదేహాన్ని గోనెసంచిలో మూట కట్టి ఊరి చివరన పాతిపెట్టారు. మళ్లీ వారే సాయన్న కనిపించడం లేదని మృతుడి తల్లిదండ్రులకు తెలియజేశారు. సాయన్న కుటుంబ సభ్యులు గురువారం చింతకుంట పోలీస్‌స్టేషన్‌లో సాయన్న కనిపించడంలేదని దానికి కారణం సాయన్న భార్య, మామలపై అనుమానం ఉందని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు భార్య శివమ్మ, మామ వెంకటన్నను విచారించగా వారు హత్య చేసి పూడ్చి పెట్టినట్లు ఒప్పుకున్నారు. వెంటనే వీరిని అదుపులోకి తీసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు.

విద్యార్థుల మానవహారం

నారాయణపేటరూరల్, మార్చి15: పేట మండలంలోని జాజాపూర్‌లో భారత ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యతపై గ్రామస్తులకు అవగాహన కల్పించడం కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు మానవహారం నిర్వహించారు. ఉపాధ్యాయురాలు మాధవి వారికి ఓటు విలువ, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం కనకప్ప పాల్గొన్నారు.

బాలస్వామికి అవార్డు

మరికల్, మార్చి 15: పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఏటా ప్రదానం చేసే కీర్తి పురస్కార్ అవార్డును మండల కేంద్రానికి చెందిన కవి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ బాలస్వామికి ప్రకటించింది. పద్యకవిత విభాగం అవార్డుకు ఎంపిక చేశారని డాక్టర్ బాలస్వామి తెలిపారు. ఈనెల 20, 21వ తేదీల్లో అందజేయనున్నారని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థినే గెలిపించండి

అన్నాసాగర్‌లో మాట్లాడుతున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే ఆల ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ప్రతినిధులతో సమావేశం
- హాజరైన ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

భూత్పూర్, మార్చి 15 : ఈనెల 28వ తేదీన జరుగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో దేవరకద్ర నియోజకవర్గంలోని ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో దాదాపు 80శాతం ఎంపీటీసీలు, 100శాతం జెడ్పీటీసీలు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఉన్నారని వారంతా బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేస్తే నవీన్‌కుమార్‌రెడ్డి గెలుపు ఖాయమని అన్నారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన గద్వాల ఎమ్మెల్యే బండ్ల మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓట్లే ఎక్కువగా ఉన్నాయని, జిల్లా వ్యాప్తంగా అత్యధిక ఎంపీటీసీలు ఉన్నారని గుర్తు చేశారు. అందరూ కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను మరిచి రోజుకోమాట చెబుతున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే ప్రజలనుంచి తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నన్ను ఎమ్మెల్సీగా గెలిపించండి పెద్ద నాయకుల నుంచి, సామాన్య కార్యకర్తల వరకు అందుబాటులో ఉండి పనిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, వనపర్తి జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, ఎంపీపీలు గుంత మౌనిక, హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సైబర్ మాయాజాలం..!

- మహ్మదాబాద్‌లో రూ.లక్షలు నష్టపోయిన సామాన్య ప్రజలు
- ప్రతిరోజూ వేలల్లో ఆదాయం చూపి లక్షలు మాయం చేసిన కేటుగాళ్లు
- లబోదిబోమంటున్న బాధితులు

మహ్మదాబాద్, మార్చి 15 : సైబర్ మోసాలకు యువత బలై లక్షల రూపాయలు నష్టపోతున్నారు. ఫేక్ కంపెనీలు వివిధ పేర్లతో వెబ్‌సైట్‌లు నిర్వహించి కంపెనీల్లో పెట్టుబడులు పెడితే వాటికి రెట్టింపు డబ్బులు ఇస్తామని ఆశచూపి గ్రామీణ ప్రాంత ప్రజలను బురిడీ కొట్టించారు. మహబూబ్‌నగర్ జిల్లా ఒక్క మహ్మదాబాద్ గ్రామంలోనే దాదాపు 50మంది బాధితులు ఓ వెబ్‌సైట్ ఫేక్ కంపెనీలో రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి మోసపోయారు. మహ్మదాబాద్, నంచర్ల, మొకర్లాబాద్‌తోపాటు ఉమ్మడి మండలంలో వివిధ గ్రామాల యువకులు ఆన్‌లైన్‌లో దాదాపు రూ.కోటి వరకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి మోసపోవడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. సంబంధిత వెబ్‌సైట్ కంపెనీ నుంచి వారం రోజులుగా ఎలాంటి లావాదేవీలు నిర్వహించకుండా సైలెంట్ కావడంతో ఒక్కసారి పెట్టుబడులు పెట్టిన వారంతా లబోదిబోమంటున్నారు. అప్పులు చేసి కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన బాధితులు ఎవరికి చెప్పుకోలేక తమలో తాము మదనపడుతున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కూడా జంకుతున్నారు. కంపెనీ వాళ్లు మొదటగా రూ.800 మొదలుకొని రూ.లక్ష వరకు పెట్టుబడులు పెట్టించి పెట్టిన డబ్బులకు ప్రతిరోజూ కొంత డబ్బును వారి అకౌంట్లలో జమ చేసేవారు. ప్రతిరోజూ డబ్బులు అకౌంట్లలో జమకావడంతో వారిలో ఆశలు పెరిగి మొదట రూ.3వేలు, రూ.5వేలు పెట్టిన వారు ఆ తర్వాత రూ.26వేలు, రూ.69వేలు, రూ.లక్ష వరకు ఇలా అప్పులు చేసి కంపెనీలో పెట్టుబడులు పెట్టారు. వారం రోజుల కిందట కంపెనీ నుంచి ఆకర్షణీమైన ఆఫర్లు ప్రకటించడంతో బాధితులు మరింత ఉత్సాహంగా పెట్టుబడులు పెట్టడమే కాకుండా తమ బంధువులు, స్నేహితులు, తెలిసినవారందితో పెట్టుబడులు పెట్టించారు. రూ.3వేలు పెడితే రూ.12 వేలు ఇస్తామని, రూ.5వేలు కడితే రూ.20వేలు ఇస్తామని, రూ.12 వేలు పెడితే రూ.30 వేలు ఇస్తామని ఇలా ఆఫర్లు ప్రకటించి ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడులు పెటించుకొన్నారు. డబ్బులు పెట్టించిన 24గంటల్లో అకౌంట్లలో డబ్బులు జమకావాల్సి ఉండగా నాలుగు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా వారి అకౌంట్లలో జమకాలేదు. సంబంధిత కంపెనీ వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి అందులో పెట్టుబడులు పెట్టిన వారిని గ్రూప్‌లో యాడ్ చేశారు. గ్రూప్ అడ్మిన్‌లు కంపెనీ వారు ఉండడమే కాకుండా గ్రూప్‌లో ఉన్న ఎవరూ ఎలాంటి మెసేజ్ పెట్టడానికి వీలు లేకుండా గ్రూప్ అడ్మిన్‌లు చెప్పినట్లు సభ్యులు నడుచుకునేవారు. ఇంతే కాకుండా వారి ఫోన్ నెంబర్లు కూడా కలువకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఒకేసారి వెబ్‌సైట్ మూసివేస్తే కస్టమర్లకు అనుమానం వస్తుందని రోజుకు ఏదో ఒకటి ఆశ చూపుతూ ఒకరి ఇద్దరి అకౌంట్లలో రూ.110 చొప్పున డబ్బుల జమచేస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. మరో రూ.వెయ్యి కంపెనీ అకౌంట్లోకి వేస్తే రూ.5వేలు ఇస్తామని, రూ.2వేలు జమ చేస్తే రూ.10వేలు ఇస్తామని ఇలా రోజుకో ట్విస్ట్ పెడుతూ సామాన్యులను మోసం చేస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో పోయిన డబ్బులు తిరిగి జమ అవుతాయా లేదా అనే అయోమయంలో బాధితులు ఎదురు చూస్తున్నారు.

మరో వెబ్‌సైట్ పేరుతో రంగంలోకి..

నష్టపోయిన వారికి ఇందులో మరో వెబ్‌సైట్‌లో కంపెనీలో లబ్ధిపొందాలంటూ ఆఫర్లు ప్రకటించారు. నెల రోజుల నుంచి ఓ ఫేక్ కంపెనీ మండలంలో పలు గ్రామాల ప్రజల నుంచి డబ్బులు పెట్టుబడులు పెట్టించి ఆన్‌లైన్ మోసాలకు పాల్పడమే కాకుండా మరో కొత్త వెబ్‌సైట్ ప్రారంభించి అందులో నష్టపోయిన వారు ఈ కంపెనీలో పెట్టుబడులు పెట్టాలని, నష్టపోయిన డబ్బులను ఇందులో సులువుగా సంపాదించుకొనే అవకాశం ఉందని కొత్త పాటను బాధితుల ముందుకు తీసుకువచ్చి మరో మోసానికి పాల్పడే యత్నాలు చేస్తున్నారు. తాజాగా గురు శుక్రవారాల్లో ఈ వెబ్‌సైట్ రావడంతో బాధితులు మోసపోకూడదని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం.

దాణా యంత్రంలో పడి ఉద్యోగి మృతి

జడ్చర్ల టౌన్, మార్చి 15 : ప్రమాదవశాత్తు మెషిన్‌లో పడి ఉద్యోగి మృతి చెందిన ఘటన పట్టణ శివారులోని గంగాపూర్ రహదారిపై ఉన్న కోళ్ల దాణా ఫ్యాక్టరీలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు ప్రకాశం జిల్లాకు చెందిన వెంకట్‌రెడ్డి కొంతకాలంగా జడ్చర్లలోని కోళ్ల దాణా ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం అతడు మొక్కజొన్న కటింగ్ మెషిన్ వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు అందులోపడి ఇరుక్కున్నాడు. తోటి ఉద్యోగులు గుర్తించి బయటకు తీసేలోగా అతడు మృతి చెందినట్లు సమాచారం. ఈ విషయంపై వివరాలు తెలియజేసేందుకు ఫ్యాక్టరీ యాజమాన్యం నిరాకరించింది. మృతుడి కుటుంబ సభ్యుల సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్‌ను తెలిపారు.

గుండెపోటుతో ఒకరి మృతి

ఊట్కూర్, మార్చి 15: మండలంలోని మొగ్దుంపూర్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సుభాశ్(48) శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఉదయం 6గంటల సమయంలో వరి పొలంలో నీరు పారబెట్టేందుకు వెళ్లిన ఆయన గుండెపోటుకు గురై అక్కడిక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

విషయం తెలియడంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, నాయకులు ఆశిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, సూర్యప్రకాశ్ రెడ్డి, నారాయణరెడ్డి పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

బహుజన వీరుడు కాన్షీరాం

మహబూబ్‌నగర్‌టౌన్ : కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ అర్బన్/రాజాపూర్, మార్చి 15 : మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల కేంద్రాలతోపాటు ఆయా గ్రామాల్లో బీఎస్పీ, మాదిగ జేఏసీ, ఆయా సంస్థల నాయకులు బహుజన సమాజ్‌వాది పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, బహుజనులను ఏకతాటిపైకి తీసుకొచ్చిన మహనీయుడు కాన్షీరాం అని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆధార్ ఉన్నా.. మహాలక్ష్మీ నై..

- 'పేట' బస్సులో ఫ్రీ టికెట్లు ఇవ్వని కండక్టర్
- హైదరాబాద్‌కు రూ.240 టికెట్ తీసుకున్న పలువురు



ఆధార్ కార్డు చూపించినా పైసలకు టికెట్ ఇచ్చాడని వాపోతున్న మహిళలు

మద్దూర్ (కొత్తపల్లి), మార్చి 15 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన మహాలక్ష్మీ పథకంపై పలువురు మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలు కాకముందే పథకం అమలు అస్తవ్యస్తంగా తయారైందని కన్నెర్ర చేస్తున్నారు. కాగా శుక్రవారం నారాయణపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పేట నుంచి మద్దూరు–కొడంగల్–పరిగి మీదు గా హైదరాబాద్‌కు బయలుదేరింది. అయితే దామరగిద్ద, క్యాతన్‌పల్లిలో పలువురు మహిళలు రాష్ట్ర రాజధానికి వెళ్లేందుకు బస్సులో ఎక్కారు. కండక్టర్ టికెట్ అడగ్గా ఒరిజినల్ కలర్ ఆధార్ కార్డులు చూపించగా.. అవి చెల్లవంటూ.. స్మార్ట్ ఆధార్ కార్డులు ఉండాలని.. మీరందరూ టికెట్ తీసుకోవాల్సిందేనని.. లేకుంటే బస్సు దిగిపోవాలని సదరు కండక్టర్ సూచించాడు. దీంతో మహిళలు చేసేది లేక హైదరాబాద్‌కు వరకు రూ.240 పెట్టి టికెట్ ను తీసుకున్నారు. మద్దూరు బస్టాండ్‌లో ఎక్కిన మహిళలు బస్ కండక్టర్‌కు ఆధార్ కార్డులు చూపించగా.. అవి చెల్లవని.. ఒరిజినల్ స్మార్ట్ కార్డులు ఉండాలని.. టికెట్ తీసుకోవాల్సిందేనని మొండిపట్టు పట్టాడు. దీం తో ఆగ్రహానికి గురైన వారితో పాటు పేటలో బస్సెక్కి టికెట్లు తీసుకున్న మహిళలు దాదాపు 15 మందికి దాకా కండక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కొద్దిసేపు మద్దూరు బస్టాండ్‌లో బస్సును నిలిపివేశారు. అయి నా కండక్టర్ వినకపోవడంతో చేసేది లేక బస్సెక్కిన మహిళలు టికెట్ తీసుకోకుండానే దిగిపోయారు. మహాలక్ష్మి పేరుతో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణమని కాంగ్రెస్ ప్రభుత్వం ఓవైపు చెబుతున్నా.. కండక్టర్ మాత్రం టికెట్లు తీసుకోవాలని వేదించడం సరికాదని మహిళలు వాపోయారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టు అప్రజాస్వామికం

మక్తల్ టౌన్, మార్చి 15: ఎమ్మెల్సీ కవిత అరెస్టు అప్రజాస్వామికమని బీఆర్ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు గవినోల నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌తో జతకట్టిన బీజేపీ మహిళను అరెస్టు చేయడం వారి రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. వెంటనే అరెస్ట్ వారెంట్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఉపాధి కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 15 : ఉపాధి కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన అభ్యర్థులకు శుక్రవారం పరీక్ష నిర్వహించారు. బ్యుటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, జర్దోసి, కంప్యూటర్, ఏసీ మెకానిక్, మొబైల్ రిపేర్, సీసీ కెమెరా, హౌస్ వైరింగ్ కోర్సుల్లో 12 బ్యాచ్‌లకు మూడు నెలల శిక్షణ ఇచ్చామని, 13వ బ్యాచ్ ప్రారంభమైనట్లు డీవైఎస్‌వో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు మార్చి 17వ తేదీ లోగా పాత డీఈవో కార్యాలయంలోని వృతిశిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 178 మంది పరీక్ష రాసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ కోఆర్డినేటర్ ఫయాజుద్దీన్, పరీక్ష నిర్వాహకులు అర్చన, మాధవి, షేక్ ఇస్మాయిల్, శ్రీనివాస్‌రావు, శిక్షణ కేంద్రం నిర్వాహకులు విజయ్‌కుమార్, జయశ్రీ, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు

పాలమూరు, మార్చి 15 : పీయూ పరిధిలోని పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పరీక్ష కేంద్రాలను పీయూ పరీక్షల నియంత్రణ అధికారి డా.రాజ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేసి మాట్లాడారు. మాస్ కాపీయింగ్, చూచి రాతకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పీజీ ప్రిన్సిపాల్ డా.చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డా.కృష్ణయ్య, పీఆర్‌వో డా.రవికుమార్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించని టీచర్లు..

- షోకాజ్ నోటీసులిస్తామన్న ఎంఈవో

మిడ్జిల్, మార్చి 15 : నిమిషం ఆలస్యమై నా పరీక్ష రాయనివ్వని అధికారులు.. వేలకు వేల జీతాలు తీసుకుంటూ పాఠశాలలకు సకాలంలో రాని ఉపాధ్యాయులపై ఎందుకు చ ర్యలు తీసుకోవడం లేదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా విద్యాధికారుల పర్యవేక్షణ లోపంతో మండలంలోని కొందరు ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. శుక్రవారం ఒంటిపూట బడులు ప్రారంభం కాగా ఉపాధ్యాయులు ఉదయం 8గంటలకే స్కూల్‌కు చేరుకోవాలి. అయితే మండలంలోని వేముల, వాడ్యాల్, అయ్యవారిపల్లి, వెలుగొమ్ముల, గిరిజన తండా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు మాత్రం 8:30 గంటలకు రావడంతో విద్యార్థులు బయటే కూర్చోవాల్సి వచ్చింది. వెలుగొమ్ములలో విద్యార్థులే తరగతి గదులను శుభ్రం చేసుకుంటున్నారు. ఇదేంటని అడగగా రోజూ మేమే శుభ్రం చేసుకుంటామని బదులిచ్చారు. కాగా ఆ పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు ఉండగా ఇద్దరే వచ్చారు. అ య్యవారిపల్లిలో ఇద్దరికి గానూ ఒక్కరే రాగా వాడ్యాల్ పాఠశాలకు తాళం కూడా తీయలేదు. ఈ విషయమై ఎంఈవో మంజులాదేవి ని వివరణ కోరగా పాఠశాలకు ఆలస్యంగా వ చ్చిన టీచర్లకు షోకాజ్ నోటీసులు ఇస్తామన్నారు. తరగతి గదులను విద్యార్థులతో శుభ్రం చేయించడంపై విచారణ చేస్తామన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరీక్ష సామగ్రి అందజేత

మాగనూర్/నవాబ్‌పేట, మార్చి 15: మండలంలోని వడ్వాట్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు శ్రీనిధి మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ త్రిఫ్ట్, క్రెడిట్ సొసైటీ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష ప్యాడ్, జామెట్రిక్ బాక్స్, పెన్ను, పెన్సిల్ అందజేశారు. నవాబ్‌పేట మండలం లోకిరేవులో పదో తరగతి విద్యార్థులకు దాతలు రాకేశ్‌రెడ్డి, ఉదయ్‌రెడ్డిలు శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నర్సింహాచారి, రాంచంద్రారెడ్డి, వజీర్, కార్యక్రమంలో సీఎఫ్‌వో ఆంజనేయులు, ప్రెసిడెంట్ వెంకట్ రాములు, అడ్వైజర్ మనివర్ధన్ రెడ్డి, మక్తల్ బ్రాంచ్ ఇన్‌చార్జి పావనికుమారి, హెచ్ ఎం ప్రసన్నలక్ష్మి, మాజీ సర్పంచ్ రవీందర్, నర్సింహులు, శ్రీనివాస్, ఆనంద్ ఉన్నారు.

పట్టు సాధించాలి

పాలమూరు, మార్చి 15 : ఎంబీఏ కళాశాలలో పరిశోధనా పద్ధతి నివేదిక రూపకల్పనపై శుక్రవారం రాష్ట్రస్థాయి కార్యశాల నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డా.రాజ్‌కుమార్, బిజినెస్ మేనేజ్‌మెంట్ సహాయ ఆచార్యులు అర్జున్‌కుమార్ హాజరై మాట్లాడారు. అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధనాపై పట్టు సాధించాలన్నారు.